వార్త నిర్భయం లో రిపోర్టర్లు కావలెను
సమాజం పట్ల అవగాహన, ప్రజా సమస్యలను ఎత్తిచూపగలిగే చైతన్యం ఉన్నవారికి ఇదే ఆహ్వానం..
తెలంగాణ& ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసేందుకు విలేకరులు కావలెను
సంచలనాల కథనాలతో సరికొత్త జర్నలిజం విలువలతో మీడియారంగంలో కొత్త శకం..
వార్తను వార్త లాగారాసే దమ్మున్న జర్నలిజంతో..చైర్మన్ ,ఎడిటర్ కాడేపాగు అశోక్ నేతృత్వంలో
సంప్రదించవల్సిన పోన్ నెం:
9949490828

తెలుగు దినపత్రిక
# వార్త నిర్భయం
సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 178 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ సోమవారం- 25 - మే - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## గత ప్రభుత్వం పాలమూరుకు ద్రోహం చేసింది.!

**కేసీఆర్ మోసం చేశాడు.. మేం న్యాయం చేస్తాం.!**

**పాలమూరు ప్రాజెక్టు, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం**

**ఎమ్మెల్యే శంకర్ కృషితోనే లక్ష్మీదేవిపల్లికి నిధులు.**

**భూసేకరణ వెంటనే.**

**58 వేల కోట్లలో 28 వేల కోట్లే ఖర్చు.**

**మంత్రి వాకిటి శ్రీహరి.**



హైదరాబాద్ మే 24 వార్త నిర్భయం పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు గెలిచి కేసీఆర్ పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడని, పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి పాలమూరుకు న్యాయం చేస్తారని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.ఆదివారం షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

### "ప్రాజెక్టు పూర్తి చేయకపోతే నాయకుడిగా వైఫల్యమే"

"లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయకపోతే ఏ నాయకుడైనా జీవితంలో ఏదో ఒకటి కోల్పోయినట్లే. కేసీఆర్‌కు అడ్రస్ లేకపోయినా ప్రాజెక్టు పూర్తి చేస్తాడని నమ్మి పాలమూరు ప్రజలు గెలిపించారు. కానీ అవినీతి కోసమే ఈ ప్రాజెక్టును వాడుకున్నారు" అని ధ్వజమెత్తారు.

### "21 స్టేజీలకు బదులు 18 స్టేజీలకే పరిమితం"

"శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 21 స్టేజీల నీళ్లు దిగుమతి చేస్తామని 18 స్టేజీలకే పరిమితం చేశారు. 58 వేల కోట్లు మంజూరైతే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పర్యావరణ అనుమతి, భూసేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు.

### "సీఎంతో చర్చించి నిధులు సాధించాం"

"పాలమూరు ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి నిధులు సాధించాం. ఎమ్మెల్యే శంకర్ కృషితోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులు వచ్చాయి. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టరేట్లలో సమావేశాల తర్వాత పనులు వేగవంతం చేస్తాం. భూసేకరణ వెంటనే మొదలుపెట్టి పెండింగ్ పనులు పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

### "కాళేశ్వరానికి వేల కోట్లు.. పాలమూరుకు మొండిచెయ్యి"

"కాళేశ్వరానికి వేల కోట్లు ఖర్చుపెట్టి పాలమూరును ఎందుకు విస్మరించారో యువత ప్రశ్నించాలి. బోర్లు వేసినా చుక్క నీరు రాని స్థితిలో ఉన్న పాలమూరుకు ఈ ప్రాజెక్టు ప్రాణాధారం" అని పేర్కొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు, జనగణన

"జనగణన, కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తాం. గతంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, ఈ విడత మరో 2 వేల ఇళ్లు ప్రతి నియోజకవర్గానికి మంజూరు చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, వైస్ చైర్మన్ అందె మోహన్, చెంది తిరుపతి రెడ్డి, పి.రఘు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో

## పడినా ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు'

- నీట్ -యూజీ పేపర్ లీక్ పై ప్రధాని మోదీ మౌనంపై రాహుల్ గాంధీ విమర్శలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్

**నీట్ పేపర్ లీక్ పై రాహుల్ గాంధీ ఫైర్**



ఢిల్లి : నీట్ -యూజీ 2026 పేపర్ లీక్ వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్ లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పేర్కొన్నారు. అందుకే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు. తెలంగాణలోని హైదరాబాద్ లో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ యూఐ) ఆధ్వర్యంలో జరిగిన నిరసన వీడియోను జతచేస్తూ రాహుల్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో రాహుల్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. "లక్షలాది మంది యువకులు రోడ్లపైకి వచ్చినప్పుడు, మిగతా..2లో

### జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం



- జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు నిధులు కేటాయించిన రేవంత్ ప్రభుత్వం
- రైతులను కాపాడాలని సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న తుమ్మల
- పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్: తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి

## మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు

# పూర్తి కావాలి..

- గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని,
- వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్‌టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని అన్నారు .
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఢిల్లి : ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ పాల్గొన్నారు.

**ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమావేశంలో పాల్గొన్నారు.**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య కూడా సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది భారీ స్థాయిలో మిగతా..2లో

### ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

**ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి**



- జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్
- ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు
- పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

హైదరాబాద్: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు మిగతా..2లో

## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే




**వైఎస్ కుటుంబ రక్త చరిత్ర తెలిసే.. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్న నారాయణ**

**స్వచ్ఛ భారత్ నిధులను కూడా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపణ**

**ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడు కార్యక్రమం జరుగుతుందన్న మంత్రి**

అమరావతి : వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ బాగా తెలుసని, జగన్ అండ్ కో మిగతా..2లో

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ



**శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం**

**బాట గంగమ్మ ఆలయం వరకు చేరిన క్యూలైన్లు**

**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు**

**నిన్న శనివారం 97 వేల మందికి పైగా స్వామివారి దర్శనం**

అమరావతి : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడిగించారు. మిగతా..2లో

### జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు భయం పట్టుకుంది



- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్న అంబటి
- అందుకే చంద్రబాబు వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శ
- చంద్రబాబు, లోకేష్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ


అమరావతి : కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని, దాని నుంచి దృష్టి మళ్లించేందుకే

## అగ్నిగుండంలా రాష్ట్రం

# వడదెబ్బతో 16 మంది మృతి

**ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురవుతున్న ప్రజలు**


- వివిధ ప్రాంతాల్లో 16 మంది మృతి
- విశాఖపట్నం ఏయూ క్యాంపస్ నివేదిక
- డిశా - ఉత్తర ఆంధ్ర వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి



అమరావతి : మే నెల చివరికి వస్తున్నా ఎండ తీవ్రత ఇంకా తగ్గుముఖం పట్టడంలేదు. వేడి సెగకు రాష్ట్రం అగ్ని గుండంలా మారింది. 2015, 2023వ సంవత్సరాల మాదిరి ఈ ఏడాది సైతం ఎల్ నినో ప్రభావం ఉండటం మూలంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులు ఎక్కువగా రావడంతో ఉక్కపోత అధికమవుతోంది. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యన అత్యవసరమైతేనే ప్రజలు బయటికి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. అయినా ఎండ వేడికి తట్టుకోలేని ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారు. అలానే ప్రాణాలు కోల్పోతున్నారు. వివిధ ప్రాంతాల్లో వడదెబ్బతో 16 మంది మృతి మిగతా..2లో

### ఏపీ సాంప్రదాయ హస్తకళలకు ఏఐ సాయంతో డిజిటల్ హంగులు

- ★ ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు
- ★ కూటమి ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను రంగంలోకి దించింది.



2లో..

అమరావతి, మే 24: ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కృత్రిమ మేధ) సాంకేతికతను రంగంలోకి దించింది.

మొదటి పేజి తరువాయి

## జగన్ మళ్లీ సీఎం అవుతారని
## చంద్రబాబుకు భయం పట్టుకుంది

సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

## లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో
## పడినా ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు‘

22 లక్షల మంది పిల్లల భవిష్యత్ ప్రమాదంలో పడినప్పుడు కూడా ప్రధాని మోదీ మౌనంగా ఉంటున్నారు. అంటే ఈ ప్రభుత్వం సమాధానం చెప్పడంపై కాకుండా, తప్పించుకోవడంపైనే దృష్టి పెట్టింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, నీట్ వంటి పేపర్ లీక్ లను అరికట్టడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేసే వరకు మేము విశ్రమించం.“

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోంది! నీట్ పేపర్ లీక్ కు నిరసనగా ఎన్ ఎస్ యూఐ అధ్యక్షుడు వినోద్ జాఖర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు హైదరాబాద్ లో పాదయాత్ర నిర్వహించారు. యువజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ఊరుకునేది లేదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సమస్యపై స్పందిస్తూ, రాహుల్ గాంధీ షేర్ చేసిన వీడియోనే రీషేర్ చేసింది. నీట్ పేపర్ లీక్ అనేది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ను చీకట్లోకి నెట్టేసిందని పేర్కొంది. “మోదీ ప్రభుత్వంలో పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోంది. కానీ బాధ్యత వహించాల్సినవారు మాత్రం కూర్చొని వేడుక చూస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో జరుగుతున్న ఈ చలగాటాన్ని మేము ఎంత మాత్రం సహించం. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.“

**- కాంగ్రెస్ పార్టీ ఎక్స్ పోస్ట్**

విద్యార్థుల కలలపై దాడి! నీట్ పేపర్ లీక్ సమస్యపై ఎన్ ఎస్ యూఐ తనదైన రీతిలో స్పందించింది. నీట్ -యూజీ 2026 పేపర్ లీక్ అనేది ‘22 లక్షల మంది విద్యార్థుల కలలపై జరిగిన దాడి‘ అని అభివర్ణించింది. విద్యార్థుల భవిష్యత్ తో చలగాటమాడడాన్ని ఇకపై సహించేది లేదని, ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ పేపర్ లీక్ కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

### రీ-నీట్

మే 3న నిర్వహించిన నీట్ -యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని మొదట్లో వార్తలు వచ్చాయి. దీనితో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ) ఆ ఆరోపణలను పరిశీలించి, పేపర్ లీక్ అయినట్లు ధ్రువీకరించి మే 12న పరీక్షను రద్దు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్ కూడా గెస్ పేపర్లు బయటకు వెళ్లాయని అంగీకరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ టీఏ జవాబుదారీతనాన్ని సమర్థిస్తూనే, జూన్ 21న రీ-టెస్ట్ పెడతామని ప్రకటించారు. ఎలాంటి తప్పులు, అక్రమాలకు తావులేకుండా 100 శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పేపర్ లీకేజీల వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మరోసారి పేపర్ లీక్ లాంటివి జరగకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జీరో ట్రస్ట్ (ఎవరినీ నమ్మకూడదనే) విధానంతో ముందుకెళ్తోంది. కాగా, నీట్ పేపర్ లీక్ అయిన నేపథ్యంలో, ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఎయిమ్స్-దిల్లీకి అప్పగించాలనే డిమాండ్లు కూడా వెల్లువెత్తాయి.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం, నిన్న మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

## దద్దరిల్లిన ఉక్రెయిన్ రాజధాని..
## యుద్ధ రంగంలోకి ‘ఒరేశ్నిక్‘ హైపర్‌సోనిక్ మిస్సైల్!

ఢిల్లి : ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించిన వివరాల ప్రకారం.. రష్యా ఏకంగా 90 క్షిపణులు, 600 డ్రోన్లను ఒకేసారి ప్రయోగించి కీవ్‌ను అతలాకుతలం చేసింది. ఈ దాడిలో అణ్వాయుధ సామర్థ్యం గల ప్రాణాంతక ‘ఒరేశ్నిక్‘ హైపర్‌సోనిక్ క్షిపణిని కూడా రష్యా ఉపయోగించడం గమనార్హం. ఈ ఘోర దాడిలో నలుగురు పౌరులు అక్కడికక్కడే మరణించగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శత్రువుల దాడుల ధాటికి వందలాది ఇళ్లు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాలు ధ్వంసమై అగ్నికి ఆహుతయ్యాయని వెల్లడించారు. “కీవ్ నగర చరిత్రలోనే ఇదొక అత్యంత భయంకరమైన రాత్రి. రాత్రంతా పేలుళ్ల శబ్దాలతో నగరం దద్దరిల్లిపోయింది” అని కీవ్ మేయర్ విటాలి క్లిట్ష్కో ఆవేదన వ్యక్తం చేశారు. కీవ్‌తో పాటు దానికి 64 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిలా సెర్క్వా పట్టణాన్ని కూడా రష్యా టార్గెట్ చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ ధృవీకరించారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే ఉక్రెయిన్ ప్రజలను ఇబ్బంది పెట్టాలనే కుట్రతో.. నగరంలోని ప్రధాన నీటి సరఫరా కేంద్రాలను రష్యా ధ్వంసం చేసిందని జెలెన్స్కీ ఆరోపించారు. రష్యా చేస్తున్న ఈ అరాచకాలకు అడ్డుకట్ట వేసేలా అమెరికా, ఐరోపా దేశాలు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### మూడోసారి రంగంలోకి ‘ఒరేశ్నిక్‘

తమ భూభాగాలపై ఉక్రెయిన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఉక్రెయిన్ వైమానిక, సైనిక స్థావరాలను నిర్వీర్యం చేయడమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా రష్యా పేర్కొంది. ఈ దాడిలో ఒరేశ్నిక్, ఇస్కాండర్, కింజల్, జిర్కాన్ వంటి విధ్వంసకర క్షిపణులను వాడినట్లు స్పష్టం చేసింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా ఈ ‘ఒరేశ్నిక్‘ హైపర్‌సోనిక్ మిస్సైల్‌ను ఉపయోగించడం ఇది మూడోసారి. ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించే ఈ క్షిపణిని ప్రపంచంలో ఏ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కూడా అడ్డుకోలేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గతంలోనే హెచ్చరించారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్
## చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ.4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

# అగ్నిగుండంలా రాష్ట్రం - వడదెబ్బతో 16 మంది మృతి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా వేడిగాలుల తీవ్రత కారణంగా శనివారం ఒక్కరోజే వివిధ ప్రాంతాల్లో వడదెబ్బతో 16 మంది చనిపోయారు. ఇందులో పన్నెండు మరణాలు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోనే సంభవించాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన జల్లా కొండలు (54), కేతనకొండకు చెందిన పఠాన్ నాగుల్మీర (32), కొటికలపూడికి చెందిన మేకా నిర్మల (50), కంచికచెర్లకు చెందిన ఎండీ అబిదున్నీసా (26), మేడికొండలూరు జిల్లా మంద్రూరుపురం నుంచి కడియాల బాలయ్య (94) వడదెబ్బ. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వద్ద వడదెబ్బకు గురై ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందగా, పెనమలూరు మండలం (కృష్ణా జిల్లా) చోడవరంలో భిక్షపతి (45) మృతి చెందాడు. విజయవాడలోని ఓల్డ్ టౌన్ ప్రాంతంలో రాజకుమారి థియేటర్ సమీపంలో, వరంగల్‌కు చెందిన వి.నరసయ్య (50) వడదెబ్బతో మృతి చెందాడు. వట్టిచెరుకూరు మండలం (గుంటూరు జిల్లా) ముట్లూరులో పడవల బసవయ్య (86) తీవ్ర వేడిమికి



అస్వస్థతకు గురై తుదిశ్వాస విడిచారు. చివరగా, పిడుగురాళ్ల పట్టణంలో (పల్నాడు జిల్లా) దొండేటి వెంకట్రావమ్మ (80), రావికమతం మండలం (అనకాపల్లి జిల్లా) కెబిపి అగ్రహారంలో వికలాంగుడైన గాడిగొయ్యిల సత్యనారాయణ (28) కూడా వడదెబ్బతో మరణించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం పెదవేగికి చెందిన మారగాని శ్రీనివాసరావు (60), అదే మండలం కొప్పాకకు చెందిన చల్లారి రత్నాలరావు (55) మృతి చెందారు. విశాఖపట్నం ఏయూ క్యాంపస్ నివేదిక ప్రకారం : రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత కొనసాగుతోంది. శనివారం నాడు, కృష్ణా జిల్లాలోని కనుమోలులో గరిష్ట ఉష్ణోగ్రత 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మకవరపాలెంలో 45.5 డిగ్రీలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో విస్తరించి ఉన్న 95 మండలాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదైనట్లు ఆ సంస్థ పేర్కొంది. “ఆదివారం నాడు, 21 మండలాల్లో తీవ్ర వడగాలుల పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. అలాగే 214 మండలాలపై వడగాలుల ప్రభావం ఉంటుందని అంచనా వేశారు. ఆదివారం నాడు ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. ఇంతలో ఛత్తీస్‌గఢ్ ఒడిశా నుంచి ఉత్తర ఆంధ్ర వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావం ఇంకా కొనసాగుతోంది. దీని ప్రభావంతో, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, పార్వతీపురం మన్యం , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని అక్కడక్కడ కొన్ని చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ సంస్థ వెల్లడించింది.

# ఏపీ సాంప్రదాయ హస్తకళలకు ఏఐ సాయంతో డిజిటల్ హంగులు

మొదటి పేజి తరువాయి

హస్తకళారూపాల అమ్మకాలను భారీగా పెంచడమే లక్ష్యంగా లేపాక్షి షోరూమ్‌లలో సరికొత్త ఏఐ వ్యవస్థలను ప్రవేశపెడుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, హస్తకళల శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ఈ వినూత్న చర్యలు చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐటీ, సాంకేతికతను ప్రభుత్వ శాఖల్లో అనుసంధానం చేయాలనే సంకల్పంలో భాగంగా హస్తకళల అభివృద్ధి సంస్థ(లేపాక్షి) ఆధునికీకరణ, పునర్వ్యవస్థీకరణపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం అనంతరం మంత్రి ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు.

### ‘తరంగా’ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ రియల్ టైమ్ పర్యవేక్షణ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 లేపాక్షి షోరూమ్‌ల నిర్వహణను ఆధునికీకరిస్తూ ‘తరంగా’ పేరుతో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి నుంచే అన్ని లేపాక్షి షోరూమ్‌ల రోజువారీ స్టాక్, అమ్మకాల వివరాలను ఈ వ్యవస్థ ద్వారా రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తారు. ఏదైనా షోరూమ్‌లో స్టాక్ తగ్గితే తరంగా వ్యవస్థ వెంటనే అలర్ట్స్ పంపుతుంది. ఏ ప్రాంతంలో ఏ కళారూపానికి ఎక్కువ డిమాండ్ ఉందో గుర్తించి, దానికి అనుగుణంగా స్టాక్‌ను రీఫిల్ చేస్తుంది. ఎక్కువ అమ్మకాలు జరిగే ప్రధాన షోరూమ్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. ఈ వ్యవస్థ ద్వారా డిమాండ్‌ను ముందే అంచనా వేసి హస్త కళాకారులకు కొత్త ఆర్డర్లను సకాలంలో అందించే వీలు కలుగుతుంది.

### ‘కళాక్షి’ వాట్సాప్ బోట్ అరచేతిలో హస్తకళల సమాచారం

వినియోగదారులను ఆకట్టుకునేందుకు ‘కళాక్షి’ పేరుతో ఏఐ ఆధారిత వాట్సాప్ లింక్‌ను ప్రభుత్వం రూపొందించింది. వినియోగదారులు తమ వాట్సాప్ ద్వారానే హస్తకళల వివరాలను తెలుసుకుని, నచ్చిన వస్తువులను ఆర్డర్ చేసుకోవచ్చు. ఆర్డర్ చేసిన వస్తువులను నేరుగా ఇంటికే డోర్ డెలివరీ చేసేందుకు ప్రభుత్వం



ఏర్పాట్లు చేస్తోంది. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కళారూపాల పూర్తి సమాచారాన్ని, వాటి వెనుక ఉన్న చరిత్రను, ప్రత్యేకతను ఈ ఏఐ టూల్ వివరిస్తుంది. అలాగే సదరు వస్తువును తయారు చేసిన హస్తకళాకారుల వివరాలను కూడా ఇది అందిస్తుంది. ‘వినియోగదారుల ఆధునిక అభిరుచులకు అనుగుణంగా లేపాక్షి కేంద్రాలను ఆధునీకీకరిస్తున్నాం. హస్తకళలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ద్వారా, మన సాంప్రదాయాన్ని నమ్ముకున్న హస్తకళాకారులకు ఆర్థిక భరోసానిచ్చి, వారికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం‘ అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ‘జీరోనే

మొదటి పేజి తరువాయి

ఎన్ని అసత్యాలు మాట్లాడినా జనం నమ్మే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. వైఎస్ కుటుంబం, వైసీపీ రక్తచరిత్ర ప్రజలకు తెలుసు కాబట్టే... గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, వచ్చే ఎన్నికల్లో వారికి సున్నా (జీరో) సీట్లు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈరోజు నెల్లూరు జిల్లాలో నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించి, ఎలాంటి అవినీతి లేకుండా నిజాయతీగా



ఉద్యోగాలను కేటాయించిందని స్పష్టం చేశారు. ఇంత మంచి జరుగుతుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై జగన్ అండ్ కో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ‘మహానాడు‘ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఈసారి హైబ్రిడ్ విధానంలో (ప్రత్యక్షంగా, వర్చువల్ గా) మహానాడు ఉంటుందని... గతంలో మాదిరే రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఈ వేదికపై మాట్లాడే పూర్తి అవకాశం కల్పిస్తామన్నారు. తన పర్యటనలో భాగంగా నెల్లూరు పరమేశ్వరనగర్ వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న మున్సిపల్ కార్పొరేట్ స్కూల్ ప్రాంతాన్ని నారాయణ సందర్శించారు. సామాన్య ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయంగా, స్విమ్మింగ్ పూల్‌తో సహా అన్ని రకాల ఆధునిక వసతులతో ఈ పాఠశాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో నగరంలోని పలు మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మారుస్తున్నామని, అలాగే ఏపీలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 1,400 కోట్లతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. మంత్రి పర్యటనలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి

మొదటి పేజి తరువాయి



2025 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుంది. ఇటీవల మా బృందం వాషింగ్టన్‌లో పర్యటించగా, త్వరలోనే అమెరికన్ బృందం భారత్ ను సందర్శిస్తుందని మేము ఆశిస్తున్నాము. ఈ రోజు మేము ఇంధన సమస్యలపై కొంత సమయం చర్చించాము. 140 కోట్ల మంది ప్రజల అవసరాలను తీర్చడం మా ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. వారికి ఇంధనం అందుబాటులో సరసమైన ధరలకు లభించేలా చూడటమే మా ప్రధాన కర్తవ్యం. అందువల్ల, ఇటీవలి నెలల్లో మన ఇంధన వాణిజ్యం విస్తరించడాన్ని స్వాగతిస్తున్నాము.“

**జైశంకర్, భారత విదేశాంగ మంత్రి**

గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించాం: రూబియో

భారత్‌లో పర్యటించడం గర్వకారణమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. భారత్, అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని కొనియాడారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి నడుస్తాయని, రెండూ ఉగ్రవాదబాధిత దేశాలేనని చెప్పారు. ఇరుదేశాలు వ్యూహాత్మక భాగస్వాములని అన్నారు. గల్ఫ్ సంక్షోభం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించామని వివరించారు. అమెరికా- భారత్ సంబంధాలు బలపడుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాముల్లో భారత్ ఒకటిగా ఉందని చెప్పారు. ఈ రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధం సంప్రదాయ దౌత్య సంబంధాలకు అతీతమైనదని అభిప్రాయపడ్డారు. “మా వాణిజ్య ప్రతినిధి త్వరలోనే భారత్ కు వస్తారు. గత వారం భారతీయ ప్రతినిధి బృందం అమెరికాను సందర్శించింది. మేము అద్భుతమైన పురోగతిని సాధించాము. అమెరికా, భారత్ మధ్య కుదిరే వాణిజ్య ఒప్పందం సుదీర్ఘకాలం నిలిచి ఉండేలా, ఇరు పక్షాలకూ ప్రయోజనకరంగా సుస్థిరంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. అంతేకాకుండా, మేము అనేక ఇతర రంగాల్లో కూడా మా సహకారాన్ని కొనసాగిస్తున్నాం. ఉదాహరణకు మా విదేశాంగ శాఖ ప్రతిపాదనను వెలువరించినప్పుడు దానికి మద్దతుగా చేరిన తొలి దేశాల్లో భారతదేశం ఒకటి.“ అని మార్కో రూబియో అన్నారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు మార్కో రూబియో. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి మరికొన్నిగంటల్లోనే ప్రపంచానికి ఒక ‘శుభవార్త‘ అందే అవకాశం ఉందని చెప్పారు. ఈ అంశంపై ట్రంప్ ప్రకటన చేస్తారని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదనేది తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ ఆధిపత్యాన్ని తప్పుపట్టారు. “ఇరాన్ పరిస్థితిపై, ఈ రోజు కాస్త ఆలస్యంగా ఈ అంశంపై మరికొన్ని వార్తలు వస్తాయని నేను భావిస్తున్నాను. దీనిపై మరిన్ని ప్రకటనలు చేయడానికి నేను అధ్యక్షుడు ట్రంప్‌కే వదిలేస్తున్నాను. కొంత పురోగతి సాధించాం. అది పూర్తిగా కాకపోయినా గణనీయమైన పురోగతి అని అనుకుంటున్నా. ఇక్కడ అంతిమ లక్ష్యం ఏంటంటే ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు. అమెరికా అధ్యక్షుడిగా ఉన్నంత కాలం ఇరాన్ కచ్చితంగా అణ్వాయుధాన్ని కలిగి ఉండదని ట్రంప్ దీనిపై స్పష్టంగా ఉన్నారు. మరొక సమస్య హార్మూజ్ జలసంధికి సంబంధించింది. ఇది అంతర్జాతీయ జలమార్గం. దీనిపై ఇరాన్‌కు ఎలాంటి యాజమాన్య హక్కులు లేవు. వారు ఒక అంతర్జాతీయ జలమార్గాన్ని ఉపయోగించే వాణిజ్య నౌకలను నాశనం చేస్తామని బెదిరిస్తున్నారు. ట్రంప్ ప్రాధాన్యత ఏంటంటే, ఈ సమస్యలను పరిష్కరించడానికి ఒక దౌత్యపరమైన మార్గాన్ని కనుగొనడం. అధ్యక్షుడి ప్రాధాన్యం ఎప్పుడూ అదే విధంగా ఉంటుంది.“ అని మార్కొ రూబియో అన్నారు.

# మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావాలి.. మంత్రి ఆదేశం

మొదటి పేజి తరువాయి

వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల మంత్రివర్గం సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణాభివృద్ధిలో వాయు కాలుష్య నియంత్రణ అత్యంత కీలకమని, పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా మారిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దీనివల్ల కాలుష్యంతో పాటు పక్క పొలాలకు మంటలు వ్యాపించి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలో టామ్‌టామ్ ద్వారా రాబోయే 15 నుంచి 30 రోజుల పాటు పంట అవశేషాలను కాల్చవద్దని విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత కూడా ఎవరైనా పంట అవశేషాలను కాల్చేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు.




మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు వంద శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీలు, రవాణా వంటి సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వంద శాతం పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్‌టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని అన్నారు . మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రివర్గం సన్‌ఫ్లవర్ కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అన్నారు. చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, వరి కొయ్యలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మహిళా సంక్షేమ వారోత్సవాలను సజావుగా నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫిడెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, డి సి ఓ శ్రీనివాస్ , డి సి ఎస్ ఓ ప్రేమ్ కుమార్, మెప్మా పీడీ రాజేష్, ఆర్టీసీ డిఎం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయం
సోమవారం 25 మే 2026

# తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి విశ్వనాథన్ పెరుమాళ్‌తో ఎమ్మెల్యే మేఘా రెడ్డి భేటీ.

**శాలువాతో సత్కరించి అభినందనలులి**

**హైదరాబాద్‌లో మర్యాదపూర్వక భేటీ .**

**పలు అంశాలపై చర్చ**



శివసేన రెడ్డి, సాయి చరణ్ రెడ్డి కూడా హాజరు హైదరాబాద్ మే 24 (వార్త నిర్భయం) ఏఐసిసి సెక్రటరీ, తమిళనాడు రాష్ట్ర మధురై జిల్లా మేలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి విశ్వనాథన్ పెరుమాళ్ ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్ వచ్చిన మంత్రి విశ్వనాథన్ పెరుమాళ్‌ను ఎమ్మెల్యే మేఘా రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించుకున్నారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, విద్యా, రాజకీయ పరిణామాలపై వారు మాట్లాడుకున్నట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి పాల్గొన్నారు

# మే 31న హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సదస్సు

**బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం:**

**మంత్రి పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్ హాజరు**

**హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేష్ పిలుపు**

**అన్ని మండలాల ముఖ్య నాయకులు తప్పక హాజరుకావాలి**



హైదరాబాద్ మే 24 (వార్త నిర్భయం) తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సదస్సును మే 31, 2026 ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు హన్మకొండ జిల్లా అధ్యక్షుడు పాడిశెట్టి గణేష్ తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎమ్మెల్సీలు, తదితర ముఖ్య నాయకులను ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. "హన్మకొండ జిల్లాలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు, మహిళా సోదరీ మణులు, అన్ని విభాగాల నాయకులు తప్పకుండా ఈ సదస్సుకు హాజరుకావాలి" అని పాడిశెట్టి గణేష్ విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు.

# చోల్లేటి రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన ఉర్దూ జర్నలిస్టుల అధ్యక్షులు



వరంగల్ ప్రతినిధి మే 24 (వార్త నిర్భయం) హనుమకొండలో ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన చోలేటి రామకృష్ణను ఆయన కార్యాలయంలో ుఖఔజీఖీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, ఎన్ఆర్ఐ మహమ్మద్ మాశూక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువా కప్పి రామకృష్ణ ని ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సామాజిక, న్యాయ సంబంధిత అంశాలపై చర్చించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని జర్నలిస్టుల ప్రతినిధులు కోరగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా సేవలు అందిస్తానని రామకృష్ణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టుల అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, ఎన్ఆర్ఐ మహమ్మద్ మాశూక్, అడ్వకేట్ బొజ్జా అనిల్ కుమార్, అడ్వకేట్ పూద్వి రెడ్డి, అడ్వకేట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## వరంగల్ తూర్పు నియోజకవర్గంలో SIR మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న బీ ఆర్ ఎస్ పార్టీ డివిజన్ నాయకులు కార్యకర్తలు



వరంగల్ ప్రతినిధి మే 24 (వార్త నిర్భయం) వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ఓటరు వివరాల పరిశీలన మరియు మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ూ×= మ్యాపింగ్ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బి ఎల్ ఏ లు పాల్గొన్నారు.వరంగల్ లొని 20 వ డివిజన్ పరిధిలోని 79,80, 85 86 90 బూతుల పరిధిలోని కాలనీలో ప్రజలకు ూ×= మ్యాపింగ్ కార్యక్రమశీలో సవరణలు మరియు చేరికల గురించి వివరించిన బీ ఆర్ ఎస్ పార్టీ ప్రతినిధులు బిఎల్ఎలు మరియు బూత్ లెవల్ అధికారులు (దీూం) పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల పేర్లు, చిరునామాలు, పోలింగ్ బూత్ మ్యాపింగ్ తదితర వివరాలను పరిశీలించి, ఎలాంటి తప్పులు ఉన్నా వెంటనే సరిచేయాలని ప్రజలకు సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునే దిశగా ప్రతి ఓటరు తన వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని పార్టీ నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండి తమ పేరు సరైన పోలింగ్ కేంద్రంలో నమోదైందో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం.

**బీసీ రాజ్యాన్ని సాధిద్దాం**

**కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే జయరాములు కి అఖిలపక్ష ఘన నివాళి.**

**వనపర్తిని విద్యాపర్తి చేసిన నీతివంతమైన నాయకుడు.**

**మర్రికుంట సమాధి వద్ద పార్టీలకు అతీతంగా నేతల శ్రద్ధాంజలి.**

వనపర్తి బ్యూరో మే 24 (వార్త నిర్భయం) మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ బీసీ ఎమ్మెల్యేలను గౌరవించి బీసీ రాజ్యాన్ని సాధిద్దామని అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా పిలుపునిచ్చింది. ఆదివారం ఉదయం మర్రికుంటలోని కీర్తిశేషులు మాజీ ఎమ్మెల్యే జయరాములు గారి సమాధి వద్ద అఖిలపక్ష ఐక్యవేదిక, టీడీపీ, డీఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ, "అప్పట్లో చిన్నగా ఉన్న వనపర్తి నియోజకవర్గాన్ని నీతివంతంగా అభివృద్ధి చేసిన నాయకుడు జయరాములు గారు. వనపర్తికి పాలకేంద్రం, కోర్టు, బస్టాండ్ సాధించిన ఘనత ఆయనదే. డిగ్రీ కళాశాల స్థాపించి వనపర్తిని విద్యాపర్తిగా మార్చిన రికార్డు ఆయనకే దక్కుతుంది" అని కొనియాడారు. గాయకుడు రాజా రామ్ ప్రకాష్ బృందం ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కార్యదర్శి రాము యాదవ్, డీఎస్పీ అధ్యక్షుడు రామకృష్ణ మహారాజ్, టీడీపీ నాయకులు ఆవుల శీను, చిన్నయ్య యాదవ్, సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్ గౌడ్, కిరణ్ కుమార్, బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి మైబూస్, గంధం నాగరాజు, దేవన్న నాయుడు తదితరులు జయరాములు గారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జయరాములు కుటుంబ సభ్యులు, బీసీ నాయకులు చీర్ల



చందర్, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, కాంగ్రెస్ నాయకులు బొంబాయి బాలకొండయ్య, సమద్, వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ అధ్యక్షులు కాగితాల లక్ష్మయ్య, యాదవ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి గురు రాజ్ యాదవ్, విజేత రాములు, గంధం బాలరాజు, పీఈటీ మురళి, శివకుమార్, నాగరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు పోలీసుల షాక్..

**గడ్చిరోలిలో రహస్య కర్మాగారం ధ్వంసం.**

**ఆయుధ తయారీ సామగ్రి స్వాధీనం - ఘటనా స్థలంలోనే నాశనం**

**లొంగిపోయిన మావోయిస్టుల సమాచారంతో 'ఆపరేషన్ అంతిమ ప్రహార్' సక్సెస్**

**లేత్ మెషీన్, బీజీఎల్ పైపులు, జనరేటర్ సహా భారీ సామగ్రి గుర్తింపు.**

హైదరాబాద్ మే 24 (వార్త నిర్భయం) మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులకు పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశారు. "ఆపరేషన్ అంతిమ ప్రహార్"లో భాగంగా మే 16న గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టులను లోతుగా విచారించగా, పోమ్కే్ం--బినాగుండా అటవీ ప్రాంతంలో ఆయుధాల తయారీ సామగ్రిని రహస్యంగా దాచిపెట్టినట్లు కీలక సమాచారం లభించింది. దీంతో మే 21న పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రమేష్ మార్గదర్శకత్వంలో గడ్చిరోలి ప్రత్యేక బృందాలు, ప్రాణహిత సంయుక్త టీమ్‌లు, బాంబు నిర్వీర్య దళం రంగంలోకి దిగాయి. మే 22న పోమ్కే్ం--బినాగుండా ఉత్తర అటవీ ప్రాంతంలో విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు మావోయిస్టులు భూమిలో పాతిపెట్టిన భారీ సామగ్రిని గుర్తించాయి. స్వాధీనం చేసుకున్నవి: ఒక లేత్ మెషీన్, బీజీఎల్ పైపులు, 12 బోర్ పైపులు, ఇన్వర్టర్, జనరేటర్, బ్యాటరీలు, గ్రైండింగ్, డ్రిల్లింగ్ యంత్రాలు, జిగ్‌సా మెషీన్, ప్రెజర్ పంప్, సోలార్ ప్యానెల్, ఫుట్‌బాల్ పైప్‌తో పాటు ఇతర సామగ్రి. పోలీసుల వివరాల ప్రకారం, నక్సల్ వారోత్సవాలు, ఎన్నికల సమయంలో భద్రతా దళాలపై దాడులకు ఈ సామగ్రిని వినియోగించేందుకు మావోయిస్టులు రహస్యంగా దాచిపెట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఘటనా స్థలంలోనే పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌ను ఎస్పీ ఎం. రమేష్, అదనపు ఎస్పీలు కార్తీక్ మధిర, గోకుల్ రాజ్, డీఎస్పీ విశాల్ నాగర్‌గోజే పర్యవేక్షించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లను ఉన్నతాధికారులు అభినందించారు.



# కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపణలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి

**హత్యా రాజకీయాల గురించి ఆయన మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది**

**మధు హత్యతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు**

**విచారణ ప్రభావితం చేసేందుకే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు**

**మాజీమంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య**




సూర్యాపేట బ్యూరో మే 24 వార్త నిర్భయం

సూర్యాపేట: టిఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్యతో కాంగ్రెస్ కి ఎలాంటి సంబంధం లేదని విచారణను ప్రభావితం చేసేందుకే మాజీమంత్రి జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. హత్య రాజకీయాల గురించి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు గాను హాస్యాస్పదంగా ఉందన్నారు. మధు హత్య పాత కక్షలతో జరిగిందా వ్యక్తిగత కక్షలతో జరిగిందా అనేది పోలీసుల



విచారణలో తేలుతుందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విచారణ అధికారిగా విచారణను ప్రభావితం చేయడం తగదన్నారు. హత్య రాజకీయాలను ఏనాడు కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించలేదని మూడుసార్లు ఓడిపోయినప్పటికీ మాజీ మంత్రి దివంగత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ల ఆధ్వర్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. మాజీమంత్రి తప్పుడు ఆరోపణలను ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. ఆ హత్యతో మా పార్టకి ఎలాంటి సంబంధం లేదని త్వరలోనే నిజాలు తేలుతాయి అన్నారు. మా పార్టీపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై లేనిపోని నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజాద్ అలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరెని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంగరి గోవర్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వెన్న మధుకర్ రెడ్డి, మద్దెబోయిన శ్రీనివాస్, గడ్డం వెంకన్న, పడిదల రవి, అక్కేనపల్లి జానయ్య, అన్నమయ్య రాము, నరేందర్ నాయుడు, కోడి వెంకటయ్య, బొప్పాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

# 14 ఏళ్ల తర్వాత కలిసిన మధుర జ్ఞాపకాలు

**ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011-12 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**



సూర్యాపేట బ్యూరో మే 24 వార్త నిర్భయం సూర్యాపేట: జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2011-2012 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర్మాన్ని కుర్రి సాయి కుమార్, బంటు భవాని, మద్దిరాల శిరీషల ఆధ్వర్యంలో స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించారు. దాదాపు 14 సంవత్సరాల అనంతరం సహ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలు మళ్లీ మదిలో మెదిలాయి. చిన్ననాటి పాఠశాల రోజులు, గురువుల బోధనలు, స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువులు బిక్షం, రామకృష్ణ, సురేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, వేణు లను పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ జీవితాలలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని, వారి మార్గదర్శకత్వమే తమ భవిష్యత్తుకు బాటలు



వేసిందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న గురువులు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగి మళ్లీ కలిసి ఆత్మీయంగా సమావేశం కావడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సమ్మేళనాలు పాత అనుబంధాలను మరింత బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని సందడి చేశారు.

# పారిశ్రామిక భూ వినియోగంపై శ్వేత పత్రం ప్రకటించాలి.

**కార్పొరేట్లకు భూపందేరం తగదు.**

**1.56 లక్షల ఎకరాల ఏపీఐఐసీ భూములపై బహిరంగ చర్చ జరగాలి**

**పరిశ్రమలు పెట్టకుండానే రుణాలు తీసుకోవడం నేరం.**

**సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్**

**జిల్లా కార్యదర్శి తోట జీవన్న**




పార్వతీపురం మే 24 (వార్త నిర్భయం) రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల పేరుతో సేకరించిన భూముల వినియోగంపై ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు.ఆదివారం .పార్వతీపురంలోని రెడ్ స్టార్ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్యతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతుల నుంచి ఏపీఐఐసీ బలవంతంగా సేకరించిన 1,56,000 ఎకరాల్లో 86 వేల ఎకరాలకు మ్యుటేషన్ పూర్తయింది. మిగిలిన 70 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి, 51,603 ఎకరాలను కంపెనీలకు బదలాయించి బ్యాంకు రుణాలకు అవకాశం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మా పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోంది" అని జీవన్న స్పష్టం చేశారు.పారిశ్రామిక అభివృద్ధి కోసం కేటాయించిన భూములపై ప్రభుత్వానికే ఆధిపత్యం ఉండాలి. ఆ విలువ మేరకు ప్రభుత్వ వాటా తీసుకోవాలి. అలాకాకుండా భూములను కార్పొరేట్లకు పందేరం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని అన్నారు.ప్రభుత్వం చవుకగా కేటాయించిన భూముల్లో పరిశ్రమలు పెట్టకుండానే బ్యాంకు రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల రాష్ట్రం లక్షల కోట్ల సంపదను కోల్పోయిందని ఆరోపించారు. "తప్పుడు విధానాలు అనుసరించిన ప్రభుత్వాలే దీనికి బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేశారు.సామాన్య రైతుల భూములను అక్రమంగా 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారు. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించడం లేదు. పేద రైతుల సాగు భూములను వెంటనే 22ఏ నుంచి తొలగించాలి" అని కోరారు.విశాఖ స్టీల్ నిర్వాసితులు సైతం ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ఏపీఐఐసీ తీసుకున్న భూములకు పలుచోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు.ఒకవైపు పీపీపీ పేరుతో ప్రభుత్వ భాగస్వామ్యం, పీ-4 పేరుతో ప్రజల భాగస్వామ్యం అంటూ మరోవైపు సర్వసంపదలను కార్పొరేట్లపరం చేయడం ప్రజలను మోసగించడమే" అని జీవన్న ధ్వజమెత్తారు.పరిశ్రమలు పెట్టకుండానే రుణాలు తీసుకోవడం నేరం. అలాంటి నేరస్తుల్లో బడా పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారు. పైసా సొంత పెట్టుబడి పెట్టకుండా బ్యాంకు అప్పులతో పరిశ్రమలు పెట్టడం, రాయితీలు పొందడం ప్రజాధనంపై ప్రైవేటుకు పెత్తనం ఇవ్వడమే" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర విభజన నుంచి గత 12 ఏళ్లలో కేటాయించిన భూములు, పెట్టిన పరిశ్రమలు, ఇచ్చిన ఉద్యోగాలు, నిర్వాసితుల పునరావాసం, ఉపాధి వివరాలతో శ్వేత పత్రం ప్రకటించాలని కోరారు. బహిరంగ చర్చ అనంతరమే భూముల కేటాయింపు కొనసాగించాలని, అప్పటివరకు భూపందేరం ఆపాలని డిమాండ్ చేశారు."పచ్చని పంటలు పండే వ్యవసాయ భూములను పరిశ్రమల పేరుతో కార్పొరేట్లకు కేటాయించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తి కోల్పోయి, పారిశ్రామిక అభివృద్ధి జరగక రాష్ట్రం రెండు విధాల నష్టపోతోంది. ప్రభుత్వం విధానాలను పునఃసమీక్షించుకోవాలి" అని జీవన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బిడ్డక రామ్మూర్తి, గరుగుబిల్లి సూరయ్య, ఏ. సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మూడు జోన్ల వేతన విభజన అశాస్త్రీయం.! తక్షణమే రద్దు చేయాలి.

**జోన్ల విభజన వల్ల వేతనాలు తగ్గే ప్రమాదం ఉంది.**

**జూరాలలో జీవోలకు వ్యతిరేకంగా నిరసన.**

**జిల్లా అధ్యక్షుడు ప్రసాద్.**



వనపర్తి బ్యూరో మే 24 (వార్త నిర్భయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు జోన్ల కనీస వేతనాల విభజన అశాస్త్రీయమని, దీనివల్ల కార్మికులకు లాభం కంటే నష్టమే ఎక్కువని టీయూసీఐ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ విమర్శించారు.ఆదివారం ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో మూడు జీవోలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 11 లక్షల మంది అసంఘటిత కార్మికులకు మూడు జోన్ల ద్వారా వేతనాలు పెరుగుతాయని ప్రకటించడంలో శాస్త్రీయత లేదు. ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేసి శాస్త్రీయబద్ధంగా వేతనాలు చెల్లించాలి" అని డిమాండ్ చేశారు.నేడు మున్సిపల్, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం, కేజీబీవీ వర్కర్లు ఇలా అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వాలు చట్టాలకే ఎగనామం పెట్టి కార్మికులను భ్రమల్లో ఉంచుతున్నాయి. ప్రకటించిన మూడు జోన్ల వల్ల గతం కంటే తక్కువ వేతనాలు వచ్చే ప్రమాదం ఉంది. వేతనాల్లో వ్యత్యాసం వల్ల కార్మికులు ఆందోళన చెందుతున్నారు" అని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో అధికారానికి వచ్చాక 73 రకాల ఉపాధి రంగాలకు కనీస వేతనాలు పెంచుతామని ప్రకటించినా, తాజా నిర్ణయం వల్ల వేతనాల్లో కోత తప్ప పెంపు లేదని ఆయన ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్‌లో ఐదు రంగాలకు నిర్దేశించిన వేతన సవరణను అమలు చేయాలి. 2021లో 5వ షెడ్యూల్ ప్రకారం 18 వేల వేతనం నిర్ణయించారు. ఆ ప్రకారం నేడు కార్మికులకు 23 వేల వేతనం రావాలి. అది కూడా అమలు కావడం లేదు" అని తెలిపారు.73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ జీవోల అమలు గురించి ప్రభుత్వం చెప్పలేదు. జీవో 11, జీవో 60 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ ప్రకారం కూడా దీనికి వర్తించవు. ఇలాంటి అశాస్త్రీయ ప్రకటనలు ఆపి రాష్ట్రంలోని 1.27 కోట్ల అసంఘటిత కార్మికులకు రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాలి" అని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, కేజీబీవీ అసంఘటిత రంగ కార్మికులకు నేటి పరిస్థితులకు అనుగుణంగా 26 వేల కనీస వేతనం ఇవ్వాలని టీయూసీఐ డిమాండ్ చేసింది.

# కాంగ్రెస్ కార్యకర్తల కృషివల్లనే రాష్ట్రంలో అధికారం: రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి

**సీఎం రేవంత్ రెడ్డి నాకు దేవుడు ఇచ్చిన సోదరుడు అని వరంగల్ లో సన్మాన సభలో రాజ్యసభ సభ్యులు వేం నరేంధర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**






వరంగల్ ప్రతినిధి మే 24 (వార్త నిర్భయం) : సీఎం రేవంత్ రెడ్డి నాకు దేవుడు ఇచ్చిన సోదరుడు, ప్రాణ స్నేహితుడని, బీఆర్ఎస్ పాలనలో ఏడు, ఎనిమిదేళ్లలో ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని నేను దగ్గరగా చూశానని రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. రేవంత్ రెడ్డి ఇచ్చే ప్రతి ఆదేశాన్ని నమ్మకంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కాంగ్రెస్ కార్యకర్తల పోరాట ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా అనేక ప్రాంతాల్లో తనను అభిమానించే ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడామని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా స్వేచ్ఛాయుత పాలన బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ నిజమైన వేదిక అని, ఆ భావజాలానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం రూ.2200 కోట్లతో 11 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో జనగామ నియోజకవర్గానికీ విస్తరిస్తామని తెలిపారు. రాబోయే గ్రేటర్ వరంగల్ ఎన్నికలు కొత్త సవాల్ అని, దేశంలోనే జీడబ్ల్యూఎంసీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాజకీయాల్లో ఎదుటివారి మాట వినే ఓపిక, సున్నితత్వం అవసరమని, అదే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. రాజకీయాల్లో అవకాశాలు పొందిన పది శాతం మంది నేతలు మిగతా తొంభై శాతం కార్యకర్తలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జూలై నెలలో మామునూర్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే అవకాశముందని, జూన్‌లో టెండర్లు పూర్తవుతాయని వెల్లడించారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు టెండర్లు పిలుస్తామని, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో కొంత వెనుకబడ్డామని అంగీకరించారు. .

# క్యూబా ఒంటరి కాదు.. అమెరికా వైదొలగాలి

**సీపీఎం వనపర్తి పట్టణ రాజకీయ శిక్షణ తరగతులు.**

**జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణంపై క్లాసులు.**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై విమర్శలు**



వనపర్తి బ్యూరో మే 24 (వార్త నిర్భయం) సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణ కార్యదర్శి ఎం. పరమేశ్వర చారి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.మొదటి సెషన్‌లో "జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు" అనే అంశంపై జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి. జబ్బార్ క్లాస్ బోధించారు. రెండో సెషన్‌లో "సీపీఎం పార్టీ నిర్మాణం - శాఖలు - సభ్యుల పని విధానం, కమ్యూనిస్టుల విశిష్టత" అనే అంశంపై జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు క్లాస్ నిర్వహించారు.ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ,క్యూబన్ విప్లవ నాయకుడు రౌల్ కాస్ట్రోపై అమెరికా న్యాయ శాఖ అభియోగాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోంది. అమెరికా ప్రపంచ పోలీసులా వ్యవహరించడం సరికాదు. ట్రంప్ మే 21న క్యూబాపై దాడి చేయాలనుకుంటున్నామని ప్రకటించడం దుర్మార్గం. క్యూబా ఒంటరి కాదు. అమెరికా క్యూబా నుండి వైదొలగాలి. క్యూబా ప్రజలకు, విప్లవ నాయకత్వానికి సీపీఎం కేంద్ర కమిటీ సంఘీభావం తెలుపుతోంది" అని అన్నారు.కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతోంది. పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలి" అని డిమాండ్ చేశారు.ఉత్తరప్రదేశ్‌లో మహిళా లాయర్‌పై అత్యాచారం చేసిన బీజేపీ నాయకుడు జైలు నుంచి బయటకు రాగానే కాళ్లు మొక్కి, శాలువాలు కప్పి ఊరేగించడం బీజేపీ సంస్కృతికి నిదర్శనం" అని విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్‌ను బెదిరించడాన్ని ఖండించారు.రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు లారీలు, సంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడిసిన ధాన్యంతో సహా వెంటనే కొనుగోలు చేసి రైతులకు భద్రత కల్పించాలి" అని డిమాండ్ చేశారు.కేరళలో ఎల్‌డీఎఫ్ రెండుసార్లు గెలిచి మూడోసారి ఓడిపోయినంత మాత్రాన కమ్యూనిస్టుల పని అయిపోయిందని బూర్జువా మీడియా ఊదరగొట్టడం సరికాదు. కార్మిక వర్గం, కష్టజీవులు ఉన్నంతకాలం ఎర్రజెండా అజేయం. సీపీఎం ఓట్లు, సీట్ల కోసమే పనిచేయడం లేదు. కార్మిక వర్గ ఐక్యతతో విప్లవం జయప్రదం చేసి సోషలిజం సాధించడమే లక్ష్యం" అని స్పష్టం చేశారు.ఈ తరగతుల్లో 18వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్, పట్టణ నాయకులు డి. కురుమయ్య, జి. బాలస్వామి, బిసన్న, జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్ రాములు, జి. దేవేందర్, రత్నయ్య, విజయ్ కుమార్, భాస్కర్, నందిమల్ల రాములు, జిల్లా కార్యాలయ కార్యదర్శి ఉమా, డి. శ్రీనివాసులు, ఎం. మన్యం, జి. మన్యం తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. వర్షానికి 6 వేల ధాన్యం బస్తాలు తడిసిపాడు

**తరుగు లేకుండా కొనాల్సిందే.**

**చిట్యాల మార్కెట్ యార్డులో 35 వేల బస్తాలు నిల్వ.**

**15 రోజులుగా లారీల కోసం ఎదురుచూపు**

**మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ డిమాండ్**



వనపర్తి బ్యూరో మే 24 (వార్త నిర్భయం) కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని, తడిసిన ప్రతి గింజను తరుగు లేకుండా కొనేదాకా రైతుల పక్షాన పోరాడతామని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ హెచ్చరించారు.ఆదివారం వనపర్తి మండలం చిట్యాల మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.మార్కెట్ యార్డులో 35 వేల బస్తాల ధాన్యం 15 రోజుల క్రితమే కాంటా వేసినా లారీలు రాక నిల్వ ఉంది. మరో 6 వేల బస్తాలు ఇంకా తూకం వేయాల్సి ఉంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి వేల బస్తాలు తడిశాయి. కాంటా వేయని 6 వేల బస్తాలు రాశుల కిందకు నీరు చేరి పూర్తిగా పాడయ్యాయి. తరలింపులో అధికారుల జాప్యం వల్లే వడ్లు తడిశాయి. దీనికి పూర్తి బాధ్యత అధికారులదే" అని ఆరోపించారు.మార్కెట్ యార్డు మైదానం పలుచోట్ల పల్లంగా ఉంది. వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిలుస్తోంది. పల్లంలో ఉన్న సంచులే ఎక్కువగా తడిశాయి. మైదానాన్ని సమాంతరం చేయాలని గతేడాది కోరినా అధికారులు పట్టించుకోలేదు" అని విమర్శించారు.చిట్యాల యార్డులో పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలు ఒకే చోట ఉన్నాయి. స్థలాలు వేరుగా లేకపోవడంతో రైతులు ఒకేచోట ధాన్యం పోస్తున్నారు. కొనమంటే ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు" అని తెలిపారు.మార్కెట్‌కు ధాన్యం తెచ్చిన రైతుల సీనియార్టీ జాబితా సిద్ధం చేసి, ఆ ప్రకారమే కాంటా వేయాలి. హమాలీలు, నిర్వాహకులు ఇష్టమైన వారి ధాన్యాన్ని ఆలస్యంగా తెచ్చినా ముందుగా కాంటా వేస్తున్నారని ఆరోపణలున్నాయి. హమాలీల కొరత కూడా సమస్యగా ఉంది" అని అన్నారు.చీమనగుంటపల్లి తాండ రైతుల ధాన్యం ఈనెల 3న 14% తేమ ఉన్నా ఇంతవరకు కాంటా వేయలేదని, వారం క్రితం తెచ్చిన వారి ధాన్యం మాత్రం కాంటా వేశారని రైతులు వాపోయినట్లు తెలిపారు.యార్డులో తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేదు. ఉన్న మరుగుదొడ్లకు నీళ్లు లేక దుర్వాసన వస్తుండటంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలి" అని డిమాండ్ చేశారు.తడిసిన ధాన్యం ప్రతి గింజ తరుగు లేకుండా కొనాలని, రైతుల సమస్యలు తీరేవరకు సీపీఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శేఖర్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : పెద్దిరెడ్డి రాజా









సూర్యాపేట బ్యూరో మే 24 వార్త నిర్భయం


సూర్యాపేట: సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మాజీ మార్కెట్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా డిసిసి జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అల్పహార కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుములపూరి రవి డిసిసి కార్యదర్శులు నేరెళ్ల మధు, షేక్ మీరా, పోలేబోయిన లింగరాజు, గాజుల రాము, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు అనుముల పూరి రాజీవ్, జిల్లా కార్యదర్శి విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


# అపొస్తలిక్ డయాసిస్ ఆఫ్ సీలాన్ (ఏ. డి. సి ) శ్రీలంక లో రెవరెండ్ ఆర్డినేషన్ పొందిన దుర్గం కరుణ శ్రీ (హెప్సిబా)

**మే 24 నేడు ప్రపంచ పెంతెకోస్తు దినోత్సవం**

**బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు**

**బిషప్ దుర్గం ప్రభాకర్**





సూర్యాపేట బ్యూరో మే 24

వార్త నిర్భయంసూర్యాపేట పట్టణ కేంద్రం ఖాసీంపేట బేతెస్థ ప్రార్థన మందిరంలో రెవ. దుర్గం కరుణ శ్రీ ( హెప్సిబా ) కి ఇటీవల కాలంలో ఇంటర్ నేషనల్ ఇండిపెండెంట్ అపొస్తలిక్ డయాసిస్ ఆఫ్ సీనాడ్ (ఐ. ఐ ఏ. డి. సి ) తేది : 17 మే 2026 న ఏ. డి. సీ డయాసిస్ - శ్రీలంక, కోలంబో లో ఆర్డినేషన్ పొంది స్వదేశగమానం చేరిన సందర్భంగా సంఘ సభ్యులు ఈరోజు బిషప్ దుర్గం ప్రభాకర్ - హెప్సిబా ను ఘనంగా సన్మానించడం జరిగింది. రెవ. దుర్గం కరుణ శ్రీ (హెప్సిబా) మాట్లాడుతూ నాకు ఎంతో సంతోషం గా ఉందని యేసుక్రీస్తు దయవలన సంఘం పట్ల, సేవా పట్ల మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ నేడు ప్రపంచ పెంతెకోస్తు దినోత్సవం (వరల్డ్ పెంటెకస్ట్ ూబఅఝఎ)మే 24, ఆదివారం నాడు.ఈస్టర్ పండుగ తర్వాత 50వ రోజున క్రైస్తవులు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారనీ దీనిని పెంతెకోస్తు పండుగ, పరిశుద్ధాత్మ దినోత్సవం, లేదా సహవాస ఆదివారం అని కూడ పిలుస్తారని యేసుక్రీస్తు పునరుత్థానం చెందిన 50 రోజుల తర్వాత, శిష్యులపై పరిశుద్ధాత్మ దేవుడు దిగివచ్చిన దినాన్ని క్రైస్తవులు స్మరించుకుంటారనీ అపోస్తలుల కార్యములు 2:1-4 లో పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి.అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొకధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి.ఈ సంఘటన ద్వారా నే క్రైస్తవ సంఘం యొక్క పుట్టినరోజుగా పరిగణిస్తారనీ పెంతెకోస్తు' అనగా గ్రీకు భాషలో 'యాభై' (50) అని అర్థం అన్నారు ఈ కార్యక్రమం లో బాబు, ఉపేందర్, వెంకన్న, కాల్వపల్లి సర్పంచ్ సంద్రపంగు వెంకన్న, నాగేశ్వరావు, యడవెల్లి బిక్షం, అబ్రాహాము, దావీదు, సురేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు